ప్రజాశక్తి
ఆదివారం 23 జులై 2023 5 విజయనగరం

ఎల్.కోటలో చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్

25న క్యాంప్ కార్యాలయం నుంచి సిఎం ప్రారంభం

ప్రజాశక్తి-లక్కవరపుకోట

జిల్లాలో చిరుధాన్యాల సాగును ప్రోత్సహించడంలో భాగంగా ఎల్.కోట మండలం రేగ గ్రామంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈనెల 25న ప్రారంభించనున్నారు. ఆరోజు ఉదయం 11 గంటలకు తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి ఆన్ లైన్ ద్వారా ప్రారంభిస్తారు. రూ.4 కోట్ల వ్యయంతో ఏర్పాటైన ఈ యూనిట్ ద్వారా 20 మందికి ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ఈ ప్రాంతంలో చిరు ధాన్యాలు సాగు చేస్తున్న వెయ్యి మంది రైతులకు ప్రయోజనం కలుగుతుంది. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద ఏర్పాటవుతున్న ఈ యూనిట్ ప్రారంభోత్సవానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి జిల్లా అధికారులను ఆదేశించారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బూడి ముత్యాలనాయుడు

ఇదేం సమీక్ష ?

ప్రజాప్రతినిధులు లేకుండా నియోజకవర్గ సమావేశం
మేయర్, ఎంపిపి, జెడ్‌పిటిసి సభ్యులు కూడా హాజరు కానివైనం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

అడిగేవారు లేరనుకున్నారో... లేక జగనన్న ఇక్కడికి వచ్చి చూస్తారా..? అనుకున్నారో గానీ ఎవరూ లేకుండా అదీ ఏకపక్షంగా సమీక్షా సమావేశం నిర్వహించి గంటలో మమా అనిపించారు. అప్పటి వరకు ఉత్కంఠతో ఉన్న అధికారులు అవాక్కయ్యారు. ఓస్... ఈపాటిదానికే ఇంత హంగామానా? అంటూ సాక్షాత్తు అధికారులు సైతం చర్చించుకోవడం వినిపించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై నియోజకవర్గాల వారీగా సమీక్ష చేసి, అందులో గుర్తించిన సమస్యలను పరిష్కరించడం ద్వారా ప్రజల మెప్పు పొందేందుకు సిఎం జగన్మోహన్‌రెడ్డి నిర్ణయించిన సంగతి తెలిసిందే. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులు సంబంధిత జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో సమీక్షలు చేయాలని ఆదేశించారు. అందులో భాగంగానే విజయనగరం నియోజకవర్గ సమీక్షా సమావేశాన్ని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి డిప్యూటీ స్పీకర్, స్థానిక ఎమ్మెల్యే అయిన కోలగట్ల వీరభద్రస్వామి మినహా మిగిలిన ప్రజాప్రతినిధులెవరూ రాకపోవడం గమనార్హం. నియోజకవర్గంలో విజయనగరం కార్పొరేషన్ అత్యంత కీలకమైనది. మంత్రి హోదా గలిగిన మేయర్ సహా మండలంలోని ఎంపిపి, జెడ్‌పిటిసి సభ్యులు కూడా సమీక్షలో లేరు. దీంతో, జరిగిన అభివృద్ధి చిట్టాను చదివి మమా అనిపించారు. ఇంతకీ ప్రజాప్రతినిధులను సమావేశానికి ఆహ్వానించారా? లేదా? అన్నదానిపై చర్చనడుస్తోంది. ప్రజలతో క్షేత్రస్థాయిలో సంబధాలు ఉన్న ప్రజాప్రతినిధులు భాగస్వామ్యమైతే సమస్యలు, చేపట్టిన పనుల్లో లోపాలు తెలిసేవని, కేవలం డిప్యూటీ సిఎం, డిప్యూటీ స్పీకర్లు అధికారులతో మాట్లాడినంత మాత్రన క్షేత్ర స్థాయి పరిస్థితులు ఎలా తెలుస్తాయని పలువురు చర్చించు కుంటున్నారు. ప్రజాప్రతిధులకు ఆహ్వానాలు కూడా అందలేదని పలువురు చర్చించుకున్నారు. దీంతో, అధికారుల పని సులవైంది.

సమస్యల పరిష్కారమే లక్ష్యం : జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి

ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా నియోజకవర్గ సమీక్షలను నిర్వహిస్తున్నామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. డిప్యూటీ స్పీకర్, స్థానిక ఎంఎల్ఎ కోలగట్ల వీరభద్రస్వామితో కలిసి విజయనగరం నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలపై కలెక్టరేట్ ఆడిటోరియంలో సమీక్ష చేశారు. ఆయా శాఖల అధికారులు నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా డిప్యుటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ నియోజకవర్గంలోని సమస్యలను వివరించారు. అందుబాటులో ఉన్న నిధులను వినియోగించుకొని గత నాలుగేళ్లుగా నియోజకవర్గంలో ఎన్నో అభివద్ధి కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. పట్టణంలో రహదారులను విస్తరించి, అభివృద్ధి చేశామన్నారు. అంబటిసత్రం జంక్షన్ కొత్తపేట అంతర్ జిల్లా ఆర్అండ్ బి రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరారు. పెద్దచెరువులో పూడిక తొలగించేందుకు సుమారు రూ.2కోట్లు అవసరమని అన్నారు. గూడ్సు షెడ్ వద్ద నిర్మించిన రైల్వే అండర్ పాస్ ప్రారంభానికి త్వరగా అనుమతి ఇప్పించాలని కోరారు. గుంకలాం లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసి, మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరారు. ఈ నాలుగేళ్లుగా పట్టణ ప్రజలకు త్రాగునీటికి పెద్దగా ఇబ్బందులు లేవని, తారకరామ తీర్థసాగర్ ను త్వరగా పూర్తి చేస్తే, సమస్య శాశ్వతంగా పరిష్కరించవచ్చునని తెలిపారు. ఇన్‌ఛార్జి మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు, అన్ని నియోజకవర్గాలపై సమీక్షా సమావేశాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎంఎల్ఏల ద్వారా సమస్యలను తెలుసుకొని, వాటిని జిల్లా స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. విజయనగరం మండలంలో అదనంగా పిహెచ్‌సి, గాజులరేగలో రైతు భరోసా కేంద్రం మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్ఒ ఎం.గణపతిరావు, సిపిఒ పి. బాలాజీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోరుయాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐద్వా నాయకులు

హింసపై మహిళల పోరుయాత్ర

- 28 నుంచి ఆగస్ట్ 9 వరకు బస్సుజాతా
- ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా జూలై 28 నుంచి ఆగస్ట్ 9 తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా బస్సు జాతా నిర్వహిస్తామని అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం (ఐద్వా) రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి తెలిపారు. శనివారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ముందుగా జాతా గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దేశంలో మోడీ, రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాల పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. అందుకు నిదర్శనమే మణిపూర్ లో జరిగిన ఘటన అని అన్నారు. వేలాదిమంది ముగ్గురు మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం, హత్య చేసారంటే ఇంతకంటే దేశం తలదించుకునే సంఘటన ఏముంటుందని అన్నారు. మరో వైపు మహిళలను మానభంగం చేసిన వారికి బెయిల్ ఇచ్చి బయటకు తీసుకొని రావడం, రెజ్లర్లను లైంగికంగా వేధించిన వారిపై చర్యలు తీసుకోకపోవడం మోడీ నిరంకుశ పాలనకు నిదర్శనమన్నారు. మణిపూర్ లో జరిగిన ఘటనపై నిజనిర్ధారణ కమిటీ వేయాలని, సుప్రీం కోర్టు జడ్జి తో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. వర్మ కమీషన్ రిపోర్టు ప్రకారం ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలన్నారు. ఈ పరిస్థితుల్లో రానున్న ఎన్నికల్లో మహిళలపై జరుగుతున్న దాడులపై అన్ని రాజకీయ పార్టీలు వారి వైఖరి మ్యానిఫెస్టోలో తెలియజేయాలని డిమాండ్ చేశారు. మహిళల రక్షణ కోసం ఐద్వా చేపట్టిన రాష్ట్ర జాతాలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. క్విట్ ఇండియా ఉద్యమం రోజు ఆగస్ట్ 9 న రాష్ట్ర జాతా ముగింపు సభ విజయవాడలో జరగనుందని తెలిపారు. ఈ సభకు ఐద్వా జాతీయ నాయకులు బృందాకరత్, పుణ్యవతి పాల్గొని ప్రసంగించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ, నాయకులు జగదాంబ, వి.లక్ష్మి, పుణ్యవతి, హరికృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

గంట్యాడ పిహెచ్‌సిలో తనిఖీలు చేస్తున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

డిఎంహెచ్ఒ తనిఖీలు

ప్రజాశక్తి-గంట్యాడ, విజయనగరం

జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి ఎస్.భాస్కరరావు శనివారం మండలంలోని పిహెచ్‌సిని, నరవలో గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం విజయనగరంలోని ప్రైవేట్ అసుపత్రులు ఎస్ వి హాస్పిటల్, ఎస్ఎస్ హాస్పిటల్, ఎంఎస్ హాస్పిటల్, శ్రీ చిత్ర స్కాన్ సెంటర్ పరిశీలించారు. విజయనగరంలోని ఈ ప్రైవేట్ ఆసుపత్రులలో (నోటిఫైబుల్ డీసీజస్, సంక్రమిత) డెంగ్యూ, మలేరియా, టైఫైడ్ మొదలగు వ్యాదులను నమోదైతే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రతిరోజు వాటి వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎపిడిమాలజిస్టు డాక్టర్ జి.వెంకటేష్ గారు, సిసి చంద్రశేఖర్‌రాజు ఉన్నారు.

అప్రమత్తతోనే సంపూర్ణ ఆరోగ్యం : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరం

అప్రమత్తతతోనే సంపూర్ణఆరోగ్యం ఉంటుందని ఎస్‌పి ఎం.దీపిక అన్నారు. వివిధ పోలీసు స్టేషన్లలో పని చేస్తున్న కింది స్థాయి ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకుతిరుమల - మెడికవర్ ఆసుపత్రి యాజమాన్యం సహకారంతో ఇప్పటి వరకు 1469మంది పోలీసులకు ఉచితంగా వైద్య పరీక్షలను పూర్తి చేసినట్లు తెలిపారు. శనివారం జిల్లాపోలీసు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎస్‌పి మాట్లాడుతూ పోలీసులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సమస్యలకు ప్రధాన కారణాలను గుర్తించి, చర్యలు చేపట్టాలని నిర్ణయించామన్నారు. ఇందుకు తిరుమల - మెడికవర్ ఆసుపత్రి యాజమాన్యం పూర్తి సహకారం అందించిందన్నారు. వీరిలో ముగ్గురు ఆరోగ్య పరిస్థితి తీవ్రంగా ఉన్నట్లుగా గుర్తించామని,వారిలో ఒకరికి బైపాస్ సర్జరీ, మరో ఇద్దరికి యాంజియోగ్రాం పరీక్షలను నిర్వహించి, వైద్యుల పర్యవేక్షణలో చికిత్సను అందిస్తున్నామన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ తిరుమలప్రసాద్, డాక్టర్ కృష్ణశాంతిలను ఎస్‌పి సత్కరించారు.

ధ్రువపత్రాలు అందించేందుకే జగనన్న సురక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అందించాలన్న గొప్ప లక్ష్యంగా జగనన్న సురక్ష పథకం అమలవుతుందని నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్ శ్రీరాములు నాయుడు స్పష్టం చేశారు. శనివారం నగరంలోని 37, 38, 39, 40, 41 డివిజన్లకు సంబంధించి ఆయా సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష పథకం అమలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువీకరణ పత్రాలను సులభతర రీతిలో పూర్తి ఉచితంగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఈ బృహత్తర కార్యక్రమానికి ప్రజల స్పందన అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు కడియాల రామకృష్ణ, తొగురోతు సంధ్యారాణి, వింత ప్రభాకర్ రెడ్డి, బోనెల ధనలక్ష్మి, సుంకరి నారాయణస్వామి, అధికారులు పాల్గొన్నారు.

చాగంటి తులసికి పురస్కారం

ప్రజాశక్తి- విజయనగరం కోట

తులసికి పురస్కారాన్ని అందజేస్తున్న భారత నిధిఫౌండేషన్ సభ్యులు

బలివాడ కాంతారావు స్మారక జీవిత సాఫల్య సాహిత్య పురస్కారాన్ని ప్రముఖ రచయిత్రి చాగంటి తులసికి శనివారం అందజేశారు. శనివారం ఆమె నివాసంలో భారత నిధి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డివిఎస్ గోపీకృష్ణ ఈ పురస్కారంతోపాటు రూ.25వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో మేడా మస్తాన్ రెడ్డి, ద్వారం దుర్గా ప్రసాదరావు, డాక్టర్ డివిజి శంకరరావు, పప్పు భోగారావు, మంజరి, చీకటి చంద్రిక, ఎన్‌కెబాబు తదితరులు పాల్గొన్నారు.

యువత మేలుకో- భవిష్యత్తు కాపాడుకో

ప్రజాశక్తి- విజయనగరం కోట

యువత మేలుకో..రాష్ట్ర భవిష్యత్తు కాపాడుకో అని టిడిపి నాయకులు కిమిడి నాగార్జున అన్నారు. తెలుగుయువత అధ్యక్షులు వేమలి చైతన్యబాబు ఆధ్వర్యంలో తెలుగుయువత సమావేశం అశోక్‌బంగ్లాలో నిర్వహించారు. సమావేశంలో పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు కిమిడి నాగార్జున , ప్రధాన కార్యదర్శి ఐవిపిరాజు ముఖ్య అతిథులుగా పాల్గొని యువతా మేలుకో.. రాష్ట్ర భవిష్యత్తు కాపాడుకో అనే పోస్టర్ ను విడుదల చేశారు. అనంతరం గార్జున మాట్లాడుతూ జగన్ రెడ్డి ప్రభుత్వంలో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ముఖ్యంగా యువత భవిష్యత్తు నాశనం అయ్యిందని అన్నారు. జగన్ మోహన్ రెడ్డి పాదయాత్ర సమయంలో ఇచ్చినటువంటి హామీలను విస్మరించారని, 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తానని హామీ ఇచ్చి , ఇప్పుడు మోసం చేశారని అన్నారు. అందుకే యువతను తెలుగుయువత ఆధ్వర్యంలో మెల్కొల్పి వారికి అండగా నిలుస్తామని అన్నారు. కార్యక్రమంలో తెలుగుయువత పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి గొలగాన సురేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులు బొచ్చు కోటిరెడ్డి, మద్దిల ప్రవీణ్, మాడుగుల జయరామ్, నియోజకవర్గాల అధ్యక్షులు గంటా రవి, పిన్నింటి కిషోర్ కుమార్, పెదిరెడ్ల సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి-పూసపాటిరేగ

శ్రీకాకుళం రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఎస్‌పి ఎ.సురేష్ బాబు ఆదేశాల మేరకు స్థానిక పిహెచ్‌సిలో అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. డాక్టర్స్, సిబ్బంది హాజరు, రోగులకు అందిస్తున్న సేవలు, పరికరాల పనితీరు, మందులు సక్రమంగా ఇస్తున్నారా లేదా తదితర విషయాలను తెలుసుకున్నారు. తనిఖీల నివేదికలను ఉన్నత అధికారులకు పంపిస్తామని తెలిపారు. తనిఖీల్లో విజిలెన్సు ఇన్‌స్పెక్టర్ బి.సింహాచలం, కానిస్టేబుల్ పురుషోత్తం, విజయనగరం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

24, 25తేదీల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని ఎత్తుబ్రిడ్జి సిగ్నల్‌పాయింట్ నుంచి ఎల్ఐసి కార్యాలయం వరకు రహదారి మధ్య విద్యుత్‌స్తంభాలను తొలగించనున్న నేపథ్యంలో ఈనెల 24, 25తేదీల్లో తోటపాలెంలోని 11కెవి పరిధి సెంటర్ బ్యాంకు ఫీడర్‌పై ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ ఇఇ నాగిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. సెంట్రల్‌బ్యాంకు, ట్యాంక్‌బండ్ రోడ్డు, తోటపాలెం రామాలయం తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఆ రెండురోజుల ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నిలిచిపోతుందని తెలిపారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై
31న చలో కలెక్టరేట్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 31న చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపడుతున్నట్లు ఆసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుధారాణి తెలిపారు. సుధారాణితో పాటు సిఐటియు నగర అధ్యక్షులు ఎ.జగన్మోహన్‌రావు శనివారం నగరంలోని పలు పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం కార్మికుల నిర్దేశించి వారు మాట్లాడుతూ ధరలు ఆకాశంలో ఉండి, మెనూ ఛార్జీలు పాతాళంలో ఉంటే పిల్లలకు నాణ్యమైన భోజనం ఎలా పెట్టగలమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఒక్కో పిల్లాడికి 20 రూపాయలు మెను ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. స్కూల్స్ విలీనం కారణంగా దశబ్దాలుగా పనిచేసిన కార్మికులకు ఉపాధి పోయిందని, 9,10 తరగతుల పిల్లల సంఖ్యకు అనుగుణంగా వర్కర్ల సంఖ్య పెంచితే అందరికీ ఉపాధి కల్పించవచ్చని ప్రభుత్వానికి సూచించారు. వంట పాత్రలు, గ్యాస్ సరఫరా చేయకుండా జగనన్న గోరుముద్ద ఎలా అమలు చేయాలన్నారు. రాగి జావా పంపిణీ వల్ల రెండు నుంచి మూడు గంటల వరకు కార్మికులపై అదనపు పని భారం పడుతోందన్నారు. నెలకు రూ.3వేల గౌరవ వేతనంతో ఏం తిని బతకాలని, అవి కూడా సకాలంలో చెల్లించకపోవడంతో అప్పులు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నెలకు రూ.10వేలు గౌరవ వేతనం ఇవ్వాలని, ప్రతి నెలా 5వ తేదీ లోపు బిల్లులు, గౌరవ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. యూనిఫాం,గ్యాస్, వంట పాత్రలు ప్రభుత్వం ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ జులై 31న కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహిస్తున్నామని, భోజన కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్వప్న, రామలక్ష్మి, లక్ష్మి, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 12వ డివిజన్ బూడి వీధి పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ లేవగానే రూపాదేవి మాట్లాడుతూ తమ డివిజన్లో ఇప్పటివరకు రూ.60 లక్షలతో అభివృద్ధి పనులు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల నేతృత్వంలో జరిగాయన్నారు. ఎన్నోఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాలలో కూడా అభివృద్ధి పనులు చురుకుగా సాగుతున్నాయన్నారు. పైడితల్లమ్మ దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మెంబర్ వెచ్చా శ్రీనివాసరావు, కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముచ్చు లయ యాదవ్, పార్లమెంటరీ పార్టీ ప్రధాన కార్యదర్శి ముద్దాడ మధు, జోనల్ ఇన్చార్జి ముచ్చు శ్రీనివాసరావు, వైసిపి నాయకులు బొంగ భానుమూర్తి, దొంకాడ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై గిరిజన జెఎసి నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మణిపూర్ ఘటనపై గిరిజన జెఎసి ఆధ్వర్యాన శనివారం అంబేద్కర్‌జంక్షన్‌లో నిరసన తెలిపారు. అనంతరంకోట జంక్షన్ వద్ద కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు తుమ్మి అప్పలరాజుదొర మాట్లాడుతూ మణిపూర్‌లో అమానవీయ ఘటనలు జరుగుతున్నా మోడీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. గిరిజన యువకుల్ని చావబాది మూత్రం పోసి చిత్రహింసల గురిచేస్తే ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. కార్యక్రమంలో బురిడీ చిన్న లక్ష్మణ,లండ పాపారావు, అమర్నాథ్, అలుగు వెంకటరావు, చందక పవన్ తదితరులు పాల్గొన్నారు.

జయభేరి మారుతీలో నియామకాలకు ఎంపికైన విద్యార్థులు

'సీతం'లో ప్రాంగణ నియామకాలు

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం జయభేరి మారుతీ సుజుకీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రాంగణ నియామకాలు చేపట్టింది. ఈ ఎంపికలో 24 మంది డిప్లొమా ఇన్ ఆటో మొబైల్ ఇంజినీరింగ్ విద్యార్థులు, మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు, బిబిఎ, ఎంబిఎ విద్యార్థులు పాల్గొన్నారు. జయభేరి సంస్థ ఎంపికచేసి చేసిన విద్యార్థులకు సర్వీస్ అడ్వైజర్స్, టెక్నికల్ అడ్వైజర్స్ టెక్నీషియన్, రిలేషన్‌షిప్ మేనేజర్ విభాగాలలో శిక్షణ ఇచ్చి వారిని పలు శాఖలలో నియిమించుకుంటారు. ఈ సందర్భంగా సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ రావు మాట్లాడుతూ విద్యార్థులకు జయభేరి సంస్థ మంచి అవకాశం కల్పించారని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మంచి బాట వేసుకోవాలని సూచించారు. ఈ నియామక ప్రక్రియలో మారుతీ జయభేరి విశాఖపట్నం మానవ వనరుల శాఖ క్లస్టర్ ఇంఛార్జి మజ్జి రామునాయుడు, విజయనగరం శాఖ క్లస్టర్ ఇన్‌ఛార్జి మజ్జి సాయి కిషోం, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ సిహెచ్ వెంకట లక్ష్మి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి.కె.రావు తదితరులు పాల్గొన్నారు.

అశాంతి..ఆందోళనలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలోని వివిధ రంగాలకు చెందిన ప్రజానీకం ఒకింత అశాంతితోనూ, ఆందోళనతోను ఉన్నారు. నిరసన కార్యక్రమాలు పెల్లుబుకుతుండడం ఇందుకు తార్కాణమని పలువురు ఉదహరిస్తున్నారు. ప్రభుత్వం మాత్రం ఇవేవీ పట్టించుకోవడం లేదు. ఎవరి దారి వారిది అన్నట్టుగా జగనన్న సురక్ష, నియోజకవర్గాల సమీక్ష, తదితర కార్యక్రమాలతో కాలక్షేపం చేస్తోంది. దీంతో, సమస్యలు మరింత జఠిలమైన ఆందోళనలు తీవ్రతరమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇటీవల కాలంలో ముందుకు వచ్చిన అంశాలను ఒక్కసారి పరిశీలిస్తే... జీడి, చెరకు రైతులు మద్ధతు ధర కోసం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వ మాటలకు చేతలకు పొంతన కదురడం లేదని జనం చర్చించుకుంటున్నారు. తమది రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటూనే రైతులకు మద్ధతు ధర, మార్కెటింగ్ సదుపాయం లేకుండా చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాది క్రితం రైతు బజార్లతో దుకాణ అద్దెలు సైతం ప్రభుత్వం అమాంతంగా పెంచేసిందంటూ గుర్తు చేస్తున్నారు. వేతనాలు పెంచాలంటూ జిల్లా వాప్తంగా విఆర్ఎలు నిరవదిక నిరాహార దీక్షలు, ధర్నాలు చేపట్టిన సంగతి తెలిసిందే. రూ.10,500 ఎలా సరిపోతాయని, ఈ వేతనాలతో కుటుంబాన్ని నెట్టుకురావడం కష్టతరంగా మారిందని చెబుతున్నారు. దీనికితోడు సంక్షేమ పథకాలు సైతం



వర్తింపజేయకపోవడంతో ఆర్థికంగా తీవ్ర అవస్థలు పడుతున్నామని వారి వాదన. ప్రభుత్వం స్పందించకపోవడంతో ఆగస్టు 7న జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, 25న విజయవాడలో నిరసన దీక్షలు చేస్తామని కూడా హెచ్చరిస్తున్నారు. మరోవైపు తమకు పాఠపుస్తకాలు ఇవ్వాలంటూ ఇంటర్ విద్యార్థులు రోడ్లు ఎక్కారు. వీరికి మద్ధతుగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నిరసన కార్యక్రమాలు కూడా జరిగాయి. చాలా కాలంగా ఎదురు చూస్తున్న మెడికల్ కాలేజీ సాకారమైన తరుణంలో 50శాతం సీట్లు విక్రయానికి పెట్టడంతో వైద్య వృత్తికోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఒకింత నిరుత్సాహానికి గురయ్యారు. నాడు - నేడు పనులు ముందుకు సాగకపోవడంతో చాలా స్కూళ్లలో తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదుల సమస్యతో విద్యార్థులు, ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారు. రూ.కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో గుత్తేదారులు కూడా ప్రభుత్వంపై గుర్రుగా ఉన్నారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో అక్రమాలు జరిగాయంటూ ఉపాధ్యాయులు కూడా ఆందోళన బాటపట్టారు. మునుపెన్నడూ లేని విధంగా రాజకీయ కక్షలతో జిల్లాలోని ఓ ఉపాధ్యాయుడ్ని హతమార్చడంతో ఉపాధ్యాయులతోపాటు జిల్లా ప్రజానీకం ఉలిక్కిపడింది. ఇలా విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, రైతులు, కార్మికులు తీవ్ర ఆందోళనతో ఉన్నారు. ప్రభుత్వం తమ జీవితాలతో చలగాటమాడుతోందంటూ ఆవేదన వ్యక్తం చేస్తునారు.

ఎగసి పడుతున్న మంటలు

బాలాజీ వస్త్రమార్కెట్‌లో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బాలాజీ వస్త్ర మార్కెట్‌లో శుక్రవారం మధ్యాహ్నం సంభవించిన అగ్ని ప్రమాదంలో 216, 217, 218 నెంబర్ గల షాపుల పై అంతస్తులోని రెండుషాపులు దగ్ధమయ్యాయి. దీంతో వాటిలో ఉన్న వస్త్రాలన్నీ కాలిపోవడంతో లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లింది. 216 నెంబర్ షాపులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు రావడంతో షాపులో పని చేస్తున్న వారు భయంతో బయటకు పరుగులు తీశారు. మేడపై షాపులు కావడంతో కింది షాపుల వారు కూడా భయంతో పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. షాపులోకి వెళ్లే అవకాశం లేకుండా గ్రిల్స్ ఉండటంతో లోపలికి వెళ్లేందుకు ఇబ్బంది పడ్డారు. దీంతో బట్టలన్నీకాలిపోయాయి. ఎంతనష్టం జరిగిందో అంచనా వేస్తున్నారు. ఆర్‌డిఒ సూర్యకళ, అగ్నిమాపక శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొనిపరిస్థితిని పరిశీలించారు. షాపులు యజమానులతో మాట్లాడారు. మంటలు అదుపులోకి రావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

బాల్య వివాహాల వల్ల అనర్థాలు

గుర్ల: బాల్య వివాహాలు వల్ల ఎన్నో అనర్థాలు జరుగుతున్నాయని బాలికలు తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలంటే బాల్యంలో బాగా చదువుకోవాలని జిల్లా సమాచార సమన్వయ అధికారి బి.రామక్రిష్ణ పిలుపునిచ్చారు. శనివారం మండలం కేంద్రంలోని కెజిబివి పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహల వల్ల కలిగే అనర్థాలు, రక్తహీనత, పోషక విలువలు, కేరీర్ గైడెన్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధికంగా బాల్య వివాహాలు మన దేశంలో జరుగుతున్నాయన్నారు. మన రాష్ట్రంలో బాల్య వివాహాలు చేసుకున్న గర్భిణీలలో 58 శాతం మంది ప్రసవ సమయంలో చనిపోతున్నారన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే టోల్ ఫ్రీ నంబరు 112 సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ శ్రీనివాసరావు, మహిళా సంరక్షణ కార్యదర్శి సునీత, ఎఎన్ఎం సంతోషికుమారి, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గజరాజుల గుంపు హల్‌చల్

వంగర : జిల్లాల తెర్లాం మండలంలో హల్‌చల్ చేసిన గజరాజుల గుంపు శనివారం సాయంత్రం వంగర మండలంలోని శ్రీహరిపురం, కొత్తపేట గ్రామాల పొలాల్లోకి ప్రవేశించాయి. ఈ విషయాన్ని గమనించిన రెవెన్యూ, పోలీస్ అధికారులు ప్రజలను అప్రమత్తం చేసేందుకు దండోరా వేయించారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఏటువంటి ప్రమాదం లేకుండా ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేసినట్లు విద్యుత్ శాఖ ఎఇ వినయ్ కుమార్ తెలిపారు.

ఆర్‌బికె ప్రారంభం

రామభద్రపురం: మండల కేంద్రంలో రూ.21లక్షలతో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని శనివారం స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందుబాటులో ఉంటాయని రైతు భరోసా కేంద్రాల సేవలను ప్రజలు సద్వినియోగించి కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు, జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతి, వైస్ ఎంపిపి బెల్లాన ప్రసాద్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయలు, పిఎసిఎస్ అధ్యక్షుడు శిల్ల చంద్రశేఖర్, మండల జెసిఎస్ కన్వీనర్ వింతల సింహాచలం, వైసిపి నాయకులు పైడిరాజు, కనిమెరక అప్పారావు, ప్రభుత్వ అధికారులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యాభ్యాసం

రామభద్రపురం: ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేయాలని నాయుడు వలస సర్పంచ్ లక్ష్మీ అన్నారు. శనివారం పాఠశాలలో ప్రభుత్వం సరఫరా చేసిన రెండవ సెమిస్టర్ పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అనేక కార్యక్రమాలను నిర్వహిస్తు అనేక వసతులను కల్పిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నాగభూషణం, ఇంగ్లీష్ పాఠశాల సహాయకులు జెసి రావు, గణిత ఉపాధ్యాయులు వేణు, శివున్నాయుడు, కృష్ణంనాయుడు, బి రవి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలి

నెల్లిమర్ల: పునాది స్థాయి ఇళ్ల నిర్మాణాలు వెంటనే ప్రారంభించాలని ఎంపిడిఒ జి. గిరిబాల సూచించారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా గొర్లిపేట జగనన్న కాలనీని ఆమె పరిశీలించి లబ్ధి దార్లతో మాట్లాడారు. పునాది స్థాయిలో ఉన్న 19 ఇళ్ల లబ్ధిదార్లు వెంటనే ప్రారంభించాలని సూచించారు. నిర్మాణం చేయకపోతే ఇళ్లు రద్దు అయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ ఆర్ పవన్, నాయకులు రామారావు, పరిసినాయుడు, పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని జగ్గయ్యపేట గ్రామంలో శనివారం హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణ సంస్థ ఎఇ సత్యనారాయణ గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే నిర్మాణాలను ప్రారంభించి ఆగస్టు నెలలో ప్రారంభానికి సిద్ధం చేయాలని సూచించారు. అప్పటికీ పనులు పూర్తి చేయని లబ్ధిదారులను ఇళ్ల పట్టాలు రద్దు చేస్తామన్నారు.

బాధిత కుటుంబాలకు 'గొంప' పరామర్శ

వేపాడ: మండలంలోని చామలాపల్లి డీలర్ గున్న అప్పల సత్యం, జాకేరు గ్రామానికి చెందిన గోకాడ ప్రవీణ్(11) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. వీరి కుటుంబాలను టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రెండు కుటుంబాలకు ఏ కష్టమొచ్చినా ఆదుకునేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం టిడిపి మహిళా అధ్యక్షులు భారతి, వేపాడ ఐటిడిపి అధ్యక్షుడు సేనాపతి గణేష్, మండల టిడిపి మహిళ చైతన్య కమిటీ ఛైర్‌పర్సన్, బాణాది ఎంపిటిసి గొంప తులసి, నాయకులు జనపరెడ్డి ఈశ్వరరావు, గొర్లె నాగరాజు, రమణ, డిఆర్‌పేట, ఎస్‌కోట, కొత్తవలస టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడి ఉదారత

శృంగవరపుకోట: మండలంలోని మూలబోడ్డవర పంచాయితీ కొండ ప్రాంతానికి అనుకుని వున్నా బొడ్డపాడు గ్రామానికి చెందిన లక్ష్మి తన కుమార్తె ద్రాక్షయని (8) తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నట్లు లక్ష్మీపురంలో నివాసం ఉంటున్న తన సోదరడు సన్యాసికి సమాచారం అందించారు. సన్యాసి వెంటనే ఫీడర్ అంబులెన్సుకు ఫోన్ చేసిన వెంటనే పైలెట్ ఫీడర్ అంబులెన్సు తీసుకుని వచ్చి లక్ష్మీపురం నుండి ఎస్‌కోట ఏరియా ఆసుపత్రికి పాపను తీసుకుని వెళ్తుండగా రాజులు కల్లాలు దగ్గరకి వచ్చేసరికి అంబులెన్స్ వాహనంలో పెట్రోల్ అయిపోవడంతో అక్కడ ఆగిపోయింది. అటుగా వెళుతున్న ఎస్ కోట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గడి బంగారు నాయుడు చూసి పైలెట్‌ను అడుగుగా పైలెట్ పెట్రోల్ అయిపోయిందని చెప్పడంతో గడి బంగారు నాయుడు హుటాహుటిన పెట్రోల్ బంక్ కు వెళ్లి పెట్రోల్ తెచ్చి మొబైల్ అంబులెన్స్‌లో వేయడంతో పైలెట్ పేషెంట్‌ని తీసుకెళ్లి సకాలంలో హాస్పిటల్‌లో జాయిన్ చేయడంతో కథ సుఖాంతం అయ్యింది.

గాంధీ నగర్ కాలనీలో బోరు ప్రారంభం

నెల్లిమర్ల: నగర పంచాయతి పరిధి గాంధీ నగర్ కాలనీలో శనివారం బోరును ఛైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైసిపి అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు, వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణ ప్రారంభించారు. ఈ బోరు ద్వారా నిత్యం థామస్‌పేట గ్రామస్తులకు తాగు నీరు అందుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో విశ్వ బ్రహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జనా ప్రసాద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బిటి రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

శృంగవరపుకోట: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం నిధులతో రెండు బి.టి రోడ్ల నిర్మాణ పనులు చేపట్టుటకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని శనివారం ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కొట్టాం ఆర్ అండ్‌బి రోడ్డు నుండి బండారువానిపాలెం వరకు రూ.1.80కోట్లతో బి.టి రోడ్డు నిర్మాణానికి, మండల కేంద్రం కోపరేటివ్ సెంట్రల్ బ్యాంకు వద్ద నుండి పెదఖండేపల్లి పాఠశాల వరకు రూ. 2కోట్లతో మరో బిటి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ రహదారుల నిర్మాణం వల్ల సంబంధిత గ్రామాల రైతులు, ప్రజలకు ఎంతో ఉపయోగం చేకూరుతుందని ఆయన తెలిపారు.

కార్యకర్త కుటుంబానికి అండగా టిడిపి

బొబ్బిలి: కార్యకర్తలకు అండగా టిడిపి ఉంటుందని టిడిపి బొబ్బిలి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన, పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అన్నారు. ఇటీవల మరణించిన బలిజిపేట మండలం పెదపెంకి గ్రామానికి చెందిన టిడిపి అభిమాని దత్తి వెంకటరావు కుటుంబానికి శనివారం చంద్రబాబు పంపిన రూ.2లక్షలు, బేబినాయన రూ.50వేలు, బలిజిపేట టిడిపి మండల అధ్యక్షులు పెంకి వేణుగోపాలనాయుడు రూ.50వేలు ఆర్థిక సహాయం చేశారు. మొత్తం నగదును చెక్కును గెస్ట్ హౌస్ లో కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పి.రామ్మోహన్ నాయుడు, పాల్గొన్నారు.

పాల్తేరులో గడపగడపకు మన ప్రభుత్వం

బాడంగి: మండలంలోని పాల్తేరు గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఇంకా అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే జగనన్న సురక్షత ద్వారా ధ్రువ పత్రాలకు దరఖాస్తు చేసుకుని ప్రభుత్వ పథకాలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి రామారావు, జెసిఎస్ కన్వీనర్ మరిపి శంకర్, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.

డెంగీ నివారణకు అవగాహన ర్యాలీ

వేపాడ: మండలంలోని బొద్దాం పిహెచ్‌సి పరిధిలోని కేజీపూడి గ్రామంలో డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ పట్నాయక్ డెంగీ వ్యాధి నివారణకు ఉపయోగించే పరికరాలను పరిశీలించారు. ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి స ఇబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మతోన్మాదాన్ని రెచ్చగొట్టేందుకే యుసిసి బిల్లు

ప్రజాశక్తి- బొబ్బిలి

దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొట్టేందుకే కేంద్రంలో బిజెపి యుసిసి బిల్లులు తీసుకువస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, సిపిఐ పట్టణ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, సిపిఐఎంఎల్ నాయకులు ఎం.గోపాలం, టి.అప్పలనాయుడు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్. గోపాలం, ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీ సంఘం నాయకులు జాఫర్, జయబాబు, ఎస్.ఎఫ్.ఐ నాయకులు శివ అన్నారు. యుసిసి బిల్లుకు వ్యతిరేకంగా గంటి ప్రసాదం భవనంలో సిపిఎం అధ్వర్యంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పి.శంకరరావు మాట్లాడుతూ స్వాతంత్ర్య దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొట్టి రాజకీయ లబ్ది పొందేందుకు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కుట్ర పన్ని యుసిసి బిల్లు తీసుకువస్తున్నారన్నారు. విభిన్న మతాలు, జాతులు ఉన్న లౌకిక దేశంలో యుసిసి బిల్లు అన్యాయమన్నారు. ఆర్థిక అసమానతలను తొలగించకుండా యుసిసి బిల్లు తీసుకురావడం దుర్మార్గమన్నారు. అన్ని మతాల, జాతుల ఆచారాలను గౌరవించాలని కోరారు. దేశంలో పేదలకు ఉచిత విద్య, వైద్యం అందించాలని, గూడు, కూడు సౌఖ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ముస్లిం మైనారిటీ సంఘం నాయకులు జాఫర్, క్రిస్టియన్ మైనారిటీ నాయకులు జయరాజ్ మాట్లాడుతూ సివిల్ కోడ్ అమలు చేసి దేశ లౌకిక వాదానికి తూట్లు పొడవడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. విభిన్న జాతులు, మతాలు నివసిస్తున్న భారతదేశాన్ని హిందు దేశంగా మార్చివేసేందుకు బిజెపి, ఆర్.ఎస్.ఎస్ పని చేస్తున్నాయన్నారు. హీరో రామ్ చరణ్ సతీమణి ఉపాసన ఆడపిల్లకు జన్మనిస్తే చూపించిన మీడియా మణిపూర్ అల్లర్లు, మహిళలపై దాడులను చూపించకపోవడం దుర్మార్గమన్నారు. ఇఫ్టూ జిల్లా నాయకులు ఎం.గోపాలం మాట్లాడుతూ మోడీ విధానాలతో దేశ ప్రగతికి నష్టమన్నారు. కార్పొరేట్, పెట్టుబడిదారులకు అనుకూలంగా మోడీ పాలన చేస్తున్నారన్నారు. సిపిఐ పట్టణ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం కులమతాలకు అతీతంగా పోరాటం చేసి స్వాతంత్ర్యం సాధిస్తే నేడు కుల, మత భేదాలను రెచ్చగొట్టి ప్రజలను బిజెపి ప్రభుత్వం విభజిస్తుందని చెప్పారు. రాజకీయ లబ్ది కోసమే సివిల్ కోడ్ తీసుకురావాలని మోడీ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలు చేయకుండా యుసిసి బిల్లు తీసుకురావడం అన్యాయమన్నారు. హామీలను అమలు చేయాలని, యుసిసి బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విభిన్న జాతులు, సంస్కృతి సంప్రదాయాలు ఉన్న దేశంలో యుసిసి బిల్లు దుర్మార్గమన్నారు. పికెఎస్ నాయకులు టి.అప్పలనాయుడు మాట్లాడుతూ నోట్లు రద్దు, జిఎస్‌టిలో దేశ ఆర్థిక వ్యవస్థను నాశనం చేసిన ఘనత మోడీకే దక్కుతుందన్నారు. పరిశ్రమలు మూతపడి కార్మికులు రోడ్డున పడుతున్న పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. యుసిసి బిల్లుకు వ్యతిరేకంగా ఈనెల 26న బొబ్బిలిలోని దక్షిణ దేవుడి వద్ద నిరసన తెలిపేందుకు తీర్మానం చేశారు. ఈ సమావేశంలో ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

రౌండ్ టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి
సమావేశంలో అఖిలపక్ష నేతలు తీర్మానం

ప్రజాశక్తి- మెంటాడ

గుర్లగెడ్డ మినీ రిజర్వాయర్‌కు బడ్జెట్‌లో నిధులు కేటాయించడం కోసం అఖిలపక్ష నేతలు ఐక్యతతో పోరాటం చేస్తేనే సాధించ వచ్చునని నేతలు అన్నారు. మెంటాడ ఆర్‌బికెలో శనివారం అఖిలపక్ష సమావేశం జరిగిం ది. రాజకీయాలకు అతీతంగా అన్నీ పార్టీల నేతలు రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈనెల 24న చలో కలెక్టరేట్ ముట్టడి, 27న డిఆర్‌సి సమావేశం జరగనున్న తరుణంలో అక్కడకు రానున్న రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి, డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కలిసి గుర్ల ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని కోరుతామని ఏకగ్రీవంగా అఖిలపక్ష నేతలంతా తీర్మానించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయ ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఇందులో భాగంగా గుర్ల గ్రామంలో సాయింత్రం ఈ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష పోరాట కమిటీ అధ్యక్షుడు పల్లి అప్పలనాయుడు, కార్యదర్శి రాకోటి రాములు, టిడిపి మండల అధ్యక్షుడు చలుమూరి వెంకట్రావు, చొక్కాలు సన్యాసి నాయుడు, వైసిపి నేతలు రెడ్డి రాజప్పల నాయుడు, కాపారపు పైడపు నాయుడు, పాశల ప్రసాద్, సిరిశెట్టి నారాయణరావు, జనవిజ్ఞానవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంట్రెటి అప్పలనాయుడు, రెడ్డి రాజగోపాల్, అల్లు అప్పలస్వామిల తోపాటు పాల్గొన్నారు.

వినతి పత్రాన్నిస్తున్న నాయకులు

జగనన్న సురక్షతో ప్రజలకు మేలు

ప్రజాశక్తి- బాడంగి

జగనన్న సురక్షతో ప్రజలకు మేలు జరుగుతోందని ఎంపిపి బోగి గౌరి అన్నారు. మండలంలోని పిన్నవలసలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా 11 రకాల ధ్రువ పత్రాలను ఉచితంగా అందిస్తున్నామన్నారు. అనంతరం 100 లబ్ధిదారులకు ఉచితంగా ధ్రువపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో మండల జెసిఎస్ కన్వీనర్ మరిపి శంకర్, వైస్ ఎంపిపి భాస్కరరావు, సచివాలయ కన్వీనర్స్ తెంటు రామినాయుడు, తెంటు తిరుపతిరావు, తెంటు తిరుపతి నాయడు, గృహ సారథులు, ఎంపిడిఒ ఆంజినేయులు, డిప్యూటీ తహశీల్దార్, ఇఒపిఆర్‌డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటి ముంగటనే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఎస్.కోట పంచాయతీ పరిధిలో గల సీతమ్మ పేటలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు వేరువేరు సమయాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 31 వరకూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, స్టేట్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు మోపాడ కుమార్, మండల ఇంఛార్జి వాకాడ సతీష్, ఏఎంసి డైరెక్టర్ డి. పార్వతీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: జగనన్న సురక్షతో ప్రతి కుటుంబం సంతోషంగా ఉండటమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. శనివారం మండలంలోని మంగళపాలెంలో నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం మంగళ పాలెం సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ నెక్కల నాయుడుబాబు, డిసిసిబి ఛైర్మన్ వేచలపు చినరామనాయుడు, నియోజకవర్గ పరిశీలకులు తైనాల విజయ్ కుమార్, రొంగలి జగన్నాథం, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్, పిఎస్ఎన్ పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: ధ్రువపత్రాలను అందిస్తున్నఎంపిపి, జెసిఎస్ కన్వీనర్ తదితరులు

సంక్షేమ పథకాలు అందని వారికి జగనన్న సురక్ష కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ అన్నారు. కొత్తవలస -1, మంగలపాలెం గ్రామాల్లో శనివారం 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కొప్పుల వెలమ కార్పోరేషన్ ఛైర్మన్ నెక్కల నాయుడు బాబు, తాసిల్దార్ శ్రీనివాస్ మిశ్రా, ఎంపిడిఒ వై. పద్మజ, పిఎసిఎస్ అధ్యక్షులు గోరపల్లి శివ, జెసిఎస్ కన్వీనర్ బొంతల వెంకట్రావు, మేలాస్త్రీ అప్పారావు, గోరపల్లి రవి, చెల్లయ్య, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా నగర పంచాయతి పరిధి జరజాపు పేట-02 వార్డు సచివాలయంలో శనివారం ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సురేష్‌బాబు మాట్లాడుతూ 502 మంది లబ్ధిదారులకు ధ్రువపత్రాలను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్ పర్సన్ బంగారు సరోజినీ, వైస్ ఛైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణ, పట్టణ వైసిపి అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు, నాగవంశం డైరెక్టర్ మద్దిల వాసు, విశ్వ బ్రాహ్మణ సంఘం డైరెక్టర్ జనా ప్రసాద్, రోడ్లు భవనాలు శాఖ డైరెక్టర్ నౌపాడ శ్రీనివాస రావు, వార్డు కౌన్సిలర్లు పాండ్రంకి సత్యవతి, అవనాపు సత్యనారాయణ, నల్లి కృష్ణవేణి, కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతుందని ఎంపిపి బంటుపల్లి వెంకటవాసు దేవరావు అన్నారు. మండలంలోని అక్కివరం, జొన్నాడ గ్రామాల్లో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అర్హులకు ఉచితంగా ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మి నాయుడు, ఎంపిడిఒ డిడి స్వరూపరాణి, తహశీల్ధార్ పి. ఆదిలక్ష్మి సర్పంచులు కోరాడ రమణి, కోటి నాయుడు, కంది కిరణ్ కుమార్, ఎంపిటిసి త్రిపురగిరి దేవి, పోలిపల్లి సొసైటీ ఛైర్మన్ బాలి సత్యనారాయణ, మండల వ్యవసాయ సలహా సంఘం ఛైర్మన్ పతివాడ సత్యనారాయణ, పాల్గొన్నారు.

పట్టాలిచ్చారు.. స్థలాలెక్కడ?

అక్కివరంలో జరిగిన జగనన్న సురక్షలో ఎంపిపిని గ్రామస్తులు పట్టాల విషయంలో నిలదీశారు. పట్టాలిచ్చి నాలుగేళ్లవుతున్నా స్థలాలు కేటాయించలేదని ప్రశ్నించారు.

కషాయాలతో చీడ పీడల నివారణ

ప్రజాశక్తి- గరివిడి

రసాయనాలు వద్దు కషాయాలు ముద్దు అంటూ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శనివారం ఉదయం మండలంలోని కొండ లక్ష్మీపురం గ్రామంలో సామూహికంగా అగ్నాస్త్రం తయారు చేశారు. గ్రామానికి చెందిన బెల్లాన తిరుమలరావు ఏడెకరాల మొక్కజొన్నలో వచ్చే కత్తిరి పురుగు నివారణ కోసం అగ్నాస్త్రం తయారు చేయించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం సిబ్బంది కుప్ప నాగమణి మాట్లాడుతూ మొక్కజొన్నలో వచ్చే కత్తిరి పురుగు నివారణకు కషాయం ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిగ అనసూయ, బి.తిరుమల రావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని కేజీ పూడి సెక్టార్ పరిధిలోగల పికెఆర్‌పురంలో నవధాన్యాలు సాగు పంటలను శనివారం సిఎస్‌ఎ రీజనల్ కోఆర్డినేటర్ వెంకటరావు పరిశీలించారు. గత మూడు, నాలుగు సంవత్సరాలుగా సుస్థిర వ్యవసాయ సాగు పద్ధతి, నవధాన్యాలు పంటల సాగు వల్ల రైతులకు కలిగే ప్రయోజనాల గూర్చి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సాగు విధానాలపై అవగాహన

బాడంగి: మండలంలోని బీమవరం గ్రామంలో శనివారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో రైతులకు సాగు విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఒ శిరీష మాట్లాడుతూ సాగులో వ్యవసాయాధికారులు సూచనలను జోడిస్తే ఖర్చులు తగ్గి అధిక లాభాలు పొందవచ్చునన్నారు. ఎరువులు, పురుగు మందులు వ్యవసాయాధికారుల సిఫార్సులు మేరకే వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో విఎఎలు వాడాడ సాయికుమార్, సిహెచ్. రాంబాబు, గ్రామ పెద్దలు చప్ప తిరుపతి రావు, దాలినాయుడు, రైతులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: డివిజనల్ స్థాయిలో గల అన్ని రైతు భరోసా కేంద్రాల పరిధిలో గల రైతులకు అన్నివేళలా సలహాలు సూచనలు ఇవ్వాలని డివిజనల్ వ్యవసాయ అధికారి విజయ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శనివారం పట్టణంలో గల మండల రైతు భరోసా కేంద్రంలో డివిజనల్ స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పిఎం కిసాన్ ఇకెవైసి, కౌలు కార్డులు రాబోయే ఖరీఫ్ కాలానికి ఈక్రాఫ్ గురించి, పంట మార్పిడి ఆవశ్యకత గురించి తెలియజేశారు. ఖరీఫ్‌లో భాగంగా ఎరువులు, పురుగుల మందులు రైతు భరోసా కేంద్రాలలో ఇండెంట్ పెట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఐదు మండలాల వ్యవసాయ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సొంత నిధులతో రోడ్డు

ప్రజాశక్తి- బొబ్బిలి

అదో గిరిజన గ్రామం. మున్సిపాలిటీలో ఉన్న ఆ గిరిజన గ్రామాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు. తమ గ్రామంలో సమస్యలు పట్టించుకోకపోవడంతో ఆ గ్రామ గిరిజన యువత చందాలు రూపంలో డబ్బులు పోగు చేసుకుని గ్రామానికి వెళ్లేందుకు రహదారిను జెసిబితో బాగు చేసుకుంటున్నారు.

బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలో పుల్లేరువలస గిరిజన గ్రామం ఉంది. గిరిజనులతో ఎన్నికల్లో ఓట్లు వేపించుకుని లబ్ధిపొందుతున్న రాజకీయ పార్టీల నేతలు ఎన్నికల తర్వాత గిరిజనుల సమస్యలను పట్టించుకోవడం లేదు. గ్రామంలో అనేక సమస్యలతో గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. పుల్లేరువలస వెళ్లే రహదారి పాడైపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షా కాలం కావడంతో గ్రామానికి వెళ్లాలంటే నరకం చూస్తున్నారు. రోడ్డు బాగు చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కోరినా పట్టించుకోకపోవడంతో గిరిజన యువత డబ్బులు చందాలు వేసుకుని సొంత డబ్బులతో జెసిబితో రోడ్డును బాగు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పర్మినెంట్‌గా బాగు చేసేందుకు చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు. గిరిజనుల సమస్యలు పట్టించుకోకపోవడం అన్యాయమని పిసిసి సభ్యులు ముద్వల శ్రీనివాసరావు అన్నారు.

జెసిబితో రోడ్డ వేసుకుంటున్న గిరిజన యువత

పాఠాలు ఎలా చెబుతారు?

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

విద్యార్థులకు పాఠాలు బోధించడానికి ఉపాధ్యాయులు సరిపడినంత మంది లేకపోతే పాఠాలు ఎలా చెబుతారని దిబ్బగుడ్డి వలస ఎంపిటిసి వి. నాగరాజు ఎంఇఒను నిలదీశారు. శనివారం స్థానిక మండలపరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి సంబంగి లక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఇఒ లక్షణరావు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరిస్తుండగా ఎంపిటిసి నాగరాజు స్కూల్ అసిస్టెంట్లు లేరని పిల్లలను ఎలా బడికి పంపిస్తామని నిలదీయడంతో ప్రభుత్వం వున్నవారితో సరి పెట్టుకోమనట్లు సమాధానం ఇచ్చారు. విద్యార్థులకు టేబులు, ఫోన్లు కాకుండా ఉపాధ్యాయులను నియమించాలని సిహెచ్ బొడ్డవలస ఎంపిటిసి సభ దృష్టికి తీసుకు వచ్చారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన ఎరువులు చాలీనన్ని ఇవ్వడం లేదని ఎన్ని ఎకరాలున్నా యురియా ఒక మూట, డిఎపి ఒక మూట మాత్రమే ఇస్తున్నారని రంగారాయిపురం ఎంపిటిసి సభ ముందు ఉంచారు. కరెంట్ బిల్లులు ఎక్కువ రావడంతో అమ్మఒడి రాలేదని, కొంత మందికి అమ్మఒడి రూ.9వేలు మాత్రమే జమ అయ్యాయని సభ్యులు తెలిపారు. ఈ సమావేశంలో వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాల్‌నాయుడు, ఎంపిడిఒ పి. రవికుమార్, జెడ్‌పిటిసి యస్. శాంతికుమారి, వైస్ ఎంపిపి శంకర్రావు, ఇఒపిఆర్‌డి ఏ. భాష్కరరావు వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

వాలంటీర్లకు నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి- గరివిడి

చీపురుపల్లి పట్టణంలో ఎంపి బెల్లాన చంద్రశేఖర్ శనివారం తన నివాసంలో వాలంటీర్లకు నియామక పత్రాలు అందజేశారు. రుంకాణ వీధికి పిల్ల మాణిక్యం, కల్లూరి సంతోషిలక్ష్మిలకు ఈ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామ వాలంటీర్ జాబ్ అనేది సేవాభావంతో చేయాలనీ చెప్పారు.ఈ కార్యక్రమంలో చీపురుపల్లి సర్పంచ్ మంగళగిరి సుధారాణి, టెలికం బోర్డు మెంబర్ ఇప్పిలి తిరుమల, ఎంపిటిసి ముల్లు పైడ్రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా పాఠ్యపుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని పినతాడివాడ ప్రాథమి కోన్నత పాఠశాలలో శనివారం ఎంఇఒ-1 కె.వెంకట రమణ చేతులు మీదుగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాఠ్య పుస్తకాలను సెప్టెంబర్‌లో విడుదల చేయాల్సి ఉన్నా ప్రభుత్వం ముందుగానే ముద్రించి ఈనెలలోనే అందరి విద్యార్థులకు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, సిఆర్‌పి భాస్కరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని బికెఎస్‌పేట వద్ద గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం, కస్తూరిబా బాలికల వసతి గృహాలను ఎంఇఒ పి బాల భాస్కరరావు శనివారం పరిశీలించారు. వసతి గృహాల్లో బాలికలకు ఇస్తున్న మెనూ వివరాలు, స్టాకు వివరాలు, బోధన విధానం పరిశీలించారు. ఈ పరిశీలనలో వసతి గృహం ఇన్చార్జి ప్రిన్సిపల్ ఉషారాణి పాల్గొన్నారు.

భోగాపురం: మండలంలోని ముక్కాం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, కొంగవానిపాలెం, బమ్మిడిపేట, రామచంద్రపేట పాఠశాలలను ఎంఇఒ-2 బాలిపల్లి చంద్రమౌళి శనివారం సందర్శించారు. పాఠశాలల్లోని వివిధ రికార్డులను, రిజిస్టర్‌లను, పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆళ్ల వెంకటేశ్వరరావు, పి శివప్రసాద్, సిఆర్టి మాత, శేషుబాబు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని దేవుదల కస్తూరిభా గాంధీ విద్యాలయాన్ని ఎంఇఒ-2 బి.ఎరకయ్య శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డులు, స్టాక్ వివరాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు, బోధన వంటివి ప్రత్యేక అధికారిణి ఎం లక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం వండి పెట్టాలన్నారు.

మణిపూర్ దుండగులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - గజపతినగరం

మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించిన దుండగులుపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జి. కార్యదర్శి డి. రాము డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ప్రభుత్వ జూనియర్ కాలేజీ నుండి మెంటాడ జంక్షన్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. రాము మాట్లాడుతూ ఈ దేశంలో బిజెపి ప్రభుత్వం మహిళలకు సమానత్వం తీసుకురావడం కోసం యుసిసిని తీసుకువస్తామని చెబుతూ మరోవైపు మణి పూర్‌లో స్త్రీలను నగ్నంగా ఊరేగించిన వాళ్లపై ఎటువంటి చర్యలూ తీసుకోక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు జగదీష్, డివైఎఫ్ఐ నాయకుడు రుద్ర ప్రసాదు, పాల్గొన్నారు.

మణిపూర్ ఘటన అమానుషం

వేపాడ : మణిపూర్‌లో ఇద్దరి మహిళలపై జరిగిన అత్యాచార దాడి అమానుషమని నియోజకవర్గం టిడిపి మహిళా అధ్యక్షులు గుమ్మడి భారతి, బాణాది ఎంపిటిసి గొంప తులసి అన్నారు. ఆమె శనివారం విలేకర్లతో మాట్లాడుతూ మణిపూర్‌లో బిజెపి గుండాలు మహిళలపై చేసిన దాడులను ప్రతి మహిళా పార్టీలకు అతీతంగా స్పందించాలన్నారు. ఇటువంటి సంఘటనకు పాల్పడిన వారిని వెంటనే ఉరితీయాలని డిమాండ్ చేశారు.

మణిపూర్ ఘటన అత్యంత దారుణమని, రాష్ట్రంలో గత రెండు నెలలుగా బిజెపి, ఆర్ఎస్ఎస్ మూకలు జరిపిన దమనకాండ సిగ్గుచేటని బహుజన కళామండలి రాష్ట్ర కార్యదర్శి ఆతవ ఉదయ భాస్కర్ విమర్శించారు. మండలంలోని ఆతవ గ్రామంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ స్త్రీలను నగ్నంగా ఊరిగించడం హేయమైన చర్య అని అన్నారు.

సమస్యలు పరిష్కరించాలి: ఎస్ఎఫ్ఐ

మెరకముడిదాం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థుల సమస్యలు వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ రామకృష్ణ అన్నారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున విద్యార్థులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పలు జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు గత సంవత్సరం నుండి పుస్తకాలు ఇవ్వలేదన్నారు. వాటిని విద్యార్థులకు తప్పనిసరిగా ఇవ్వాలని, కళాశాలల్లో విద్యార్థులకు మధ్యహాన్న భోజన వసతి సౌకర్యం కల్పించాలని కోరారు.

కోళ్లు, మేకపోతుల అపహరణ

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని పలు ప్రాంతాల్లో కోళ్లు, మేకలు, గొర్రెలు రాత్రి పగలు తేడా లేకుండా దొంగలు ఎత్తుకుపోతుండటంతో పెంపకం దారులు లబోదిబోమంటున్నారు. గురువారం పినతాడివాడ, సవరవిల్లి రోడ్డులోని సుంకర వారి కల్లాలు, నాకిం చెరువు శాలల వద్ద ఇటీవల రూ. లక్ష విలువ చేసే కోళ్లను దొంగలు రాత్రి సమయంలో పట్టుకుపోయారు. శుక్రవారం ఊరచెరువు కల్లాల వద్ద సుమారు 50 వేల రూపాయలు విలువచేసి కోళ్ళను దొంగలు తీసుకువెళ్లిపోయారు. రెండు రోజులు వరుసుగా కోళ్లను దొంగిలించడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కల్లాల వద్ద ఉంచిన కోళ్లను రాత్రి సమయంలో దొంగలు మోటార్ సైకిల్ పై ఆటోలపై వచ్చి దొంగిలించి తీసుకెళ్లిపోతున్నట్లు తెలిస్తోంది. పినతాడివాడ జంక్షన్ సమీపంలో కెవిఆర్ లేఔట్‌లో పెంపకం దారుడు ఉంటుండగానే మేకపోతును దొంగలు పట్టపగలే పట్టుకుని ఆటోలో వెళ్లిపోయారు. పెంపకం దారుడు తన మేకలు, గొర్రెలను లేఅవుట్లో ఉంచగా అక్కడకు ముగ్గురు వ్యక్తులు ఆటోలో వచ్చి మేకను పట్టుకొని సెల్ఫీ తీసుకుంటామని చెప్పి ఆటో ఎక్కి దాన్ని పట్టుకొని పరారయ్యారు. మేకల యజమాని కేకలు వేసుకుంటూ వెనుకనే పరిగెత్తినా ఫలితం లేకపోయింది. అప్పటికే ఆటోలో దొంగలు పరారయ్యారు. దీనిపై పెంపకం దారుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇప్పటికైనా పోలీసులు ఇటువంటి వారిపై దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని స్థానిక కోరుతున్నారు.